# నాయకుడు ఎదిగేది ప్రతిపక్షంలోనే

## ప్రజల మధ్య ఉంటేనే తృప్తి కలుగుతోంది

## నేను రాసిస్తా.. ఈ ప్రభుత్వం మళ్లీ రాదు: బాబు





వికలాంగుల సమాఖ్య రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.కోటేశ్వరరావు వాహనంలో చంద్రబాబు ★ కల్లుగీత కార్మికులతో బాబు

విశాఖపట్నం - న్యూస్‌టుడే

"అధికారంలో ఉన్నప్పుడు కొన్ని ఇబ్బందులుంటాయి. ప్రతిపక్షంలో ఉంటేనే నాయకుడిగా ఎదగడం సాధ్యమవుతుంది. 1989-94 మధ్య ఏ హోదా లేకుండానే ప్రజల కోసం నేను పనిచేసినప్పుడు మంచి ప్రతిష్ఠ వచ్చింది. గత నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఉన్నా సంతృప్తి కలగలేదు. 57 రోజులుగా ప్రజల మధ్య ఉన్న నాకు ఇప్పుడు చాలా తృప్తి, గుర్తింపు కలుగుతున్నాయి" అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'మీ కోసం' యాత్రలో భాగంగా సోమవారం విశాఖజిల్లాలోని ఆనందపురం-తగరపువలస నడుమ బస చేసిన ఆయన కార్యకర్తలు, నేతల సమావేశంలోను, అనంతరం విలేకరులతోనూ మాట్లాడారు. నాయకుడు బాగుంటేనే సమస్యలు తీరతాయని, జిల్లాలో నేతలెవరైనా గ్రూపులు నిర్వహిస్తున్నా ఆ ప్రలోభాల్లో పడవద్దని కార్యకర్తలకు ఉద్బోధించారు. రాజకీయ కక్ష సాధింపులో తెదేపా కార్యకర్తలపై పెట్టిన కేసులన్నీ ఉపసంహరించేలా చూస్తానని పేర్కొన్నారు. "కాంగ్రెస్ నేతలందరిలోనూ వైఎస్ తీరు వేరు. ప్రత్యర్థులపై మానసికంగా, ఆర్థికంగా దాడి చేయించడం ఆయన నైజం. ఇలాంటి దౌర్భాగ్యపు, దుర్మార్గపు ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలి. నేను రాసిస్తా... ఈ ప్రభుత్వం మళ్లీ రాదు. అలాగని ఉదాసీనత వద్దు. పోరాడండి, ప్రతిష్ఠ పెంచండి" అని కార్యకర్తలకు సూచించారు. ఈసారి బీసీలకు 100 సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

**8 నెలలు కష్టపడితే భవిష్యత్తు మనదే:** "రాబోయే 8 నెలలు బాగా కష్టపడండి. ఆ తర్వాత మీ భవిష్యత్తు నాకు విడిచిపెట్టండి. మిమ్మల్ని రాజకీయంగా, ఆర్థికంగా ఎలా ఆదుకోవాలో నేను చూసుకుంటా. ఈ ఎన్నికల్లో దెబ్బ తింటే భవిష్యత్తు ఉండదు. 1996, 1998, 1999 ఎన్నికల్లో మీరు ఎలా పోరాడాలో రుజువు చేశారు. ఈసారి ఆ సంకల్పం తీసుకొంటే 50శాతం గెలుపు సాధించినట్లే" అని కార్యకర్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై రాజీ లేకుండా పోరాడితేనే వారిలో చైతన్యం వస్తుందన్నారు. కొన్ని జిల్లాల్లో ఇంకా చురుగ్గా పార్టీ కార్యక్రమాలు జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. "ప్రజా సమస్యలపై పోరాటం ఉద్ధృతం చేయాలి. పల్లెనిద్ర చేయాలి. ఇంటింటికి వెళ్లాలి. సమస్యలు రాసుకోవాలి. సాయంత్రం రచ్చబండ వద్ద చర్చనీయాంశం చేయాలి. ఎన్నికల సమయంలో మనం వెళితే ఓట్ల కోసం వచ్చామనుకొంటారు. ఇప్పుడైతే వారి కోసం వచ్చినట్లుగా భావిస్తారు" అని ఉద్బోధించారు.

**సహించం.. ఉపేక్షించం:** తెలంగాణ విషయంలో పార్టీకి నష్టపరిచేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదని చంద్రబాబు మరోమారు స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అది క్రమశిక్షణ ఉల్లంఘన కిందే వస్తుందని హెచ్చరించారు. విద్య, ఆరోగ్యం రెండింటిపై తమ పార్టీ త్వరలో విధాన నిర్ణయాన్ని తీసుకోబోతుందని చంద్రబాబు ప్రకటించారు.

### వరికి మద్దతు ధరపై ప్రధానికి బాబు లేఖ

హైదరాబాద్: వరికి క్వింటాల్‌కు వెయ్యి రూపాయల మద్దతు ధర ఇవ్వాల్సిందిగా కోరుతూ తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు సోమవారం ప్రధాని మన్మోహన్ సింగ్‌కు లేఖ రాశారు.